


కరపత్రం

SINCE 2014

శనివారం ఫిబ్రవరి 08 2025 సంపుటి :0 సంచిక : 117 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు: 4

# తెలంగాణ కేబినెట్ విస్తరణ

# ఇప్పట్లో లేనట్టే

దిల్లీ: తెలంగాణ కేబినెట్ విస్తరణ ఇప్పట్లో లేనట్టేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దిల్లీ పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "మంత్రివర్గంలో ఎవరు ఉండాలో అధిష్ఠానానిదే తుది నిర్ణయం. నేను ఎవరి పేరు ప్రతిపాదించట్లేదు. ప్రతిపక్ష నేతలపై కేసుల విషయంలో చట్ట ప్రకారమే వెళ్తాం. త్వరగా అరెస్టు చేయించి జైలులో వేయాలనే ఆలోచన మాకు లేదు. సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా పనిచేస్తున్నాం. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని కులగణన సర్వే చేశాం. కులగణనతో ముస్లిం రిజర్వేషన్లకు శాశ్వత పరిష్కారం లభించినట్లు అయింది. పీసీసీ కార్యవర్గ కూర్పు కొలిక్కి వచ్చింది. దీనిపై ఒకట్రెండు రోజుల్లో ప్రకటన ఉంటుంది.

రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ నేను కోరలేదు. రాహుల్‌తో నా అనుబంధంపై తెలియనివాళ్లు మాట్లాడితే నాకేంటి? ప్రభుత్వం, పార్టీలో కీలక నిర్ణయాలు అధిష్ఠానం దృష్టిలో ఉంటాయి. పార్టీ, పార్టీ నేతల మనోభావాలకు అనుగుణంగానే ఉంటా. వ్యక్తిగత నిర్ణయాలు ఎప్పుడూ ఉండవు. పార్టీ ఇచ్చిన పని పూర్తి చేయడమే నా లక్ష్యం. పని చేసుకుంటూ పోవడమే నాకు తెలుసు. ప్రతి ఒక్క విమర్శకు స్పందించాల్సిన అవసరం లేదు. కులగణనలో బీసీలు ఐదున్నర శాతం పెరిగారు. బీసీలు పెరిగిన విషయాన్ని లెక్కలతో సహా చూశాక భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్ అసెంబ్లీలో అంగీకరించారు" అని సీఎం వివరించారు.



- మంత్రివర్గ సభ్యుల ఎంపికపై అధిష్ఠానమే తుది నిర్ణయం తీసుకుంటుందని రేవంత్ రెడ్డి స్పష్టం.
- చట్టపరంగా ముందుకెళ్తామని, వెంటనే అరెస్టు చేయాలని యోచన లేదని వివరణ.
- బీసీల సంఖ్య పెరిగిందని, ముస్లిం రిజర్వేషన్లకు శాశ్వత పరిష్కారం లభించినట్లు వెల్లడింపు.

## ద్వితీయ.. తృతీయ శ్రేణి నగరాలకు పరిశ్రమలు విస్తరించాలి: మంత్రి శ్రీధర్‌బాబు



2 లో

## మస్తాన్ సాయి కేసు.. రంగంలోకి యాంటీ నార్కోటిక్స్ పోలీసులు



2 లో

## ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై కేసు నమోదు



2 లో


## భయభ్రాంతులకు గురి చేసేందుకు కొందరు యత్నిస్తున్నట్లుంది

- సంగారెడ్డి జిల్లా ఐలాపూర్‌లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ శుక్రవారం పర్యటించారు.
- స్థానికంగా ఉన్న ఓ ప్లాట్ అసోసియేషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగనాథ్ అక్కడికి వెళ్లారు.



# సర్వేలో పాల్గొన్న వాళ్లకే కులగణనపై మాట్లాడే అవకాశం

- కులగణనపై వివరణ - కులసంఘాల నేతలకు సర్వే వివరాలను చెబుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం.
- బీసీలకు ప్రాధాన్యత - బీసీలకు 42% సీట్లు ఇవ్వడానికి కాంగ్రెస్ సిద్ధంగా ఉందని ప్రకటింపు.
- భాజపా విమర్శ - కులగణనను మద్దతు ఇవ్వకుండా భాజపా కేంద్రంలో అఫిడవిట్ ఇచ్చిందని



కరీంనగర్: కులగణనపై కులసంఘాల నేతలకు వివరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కులగణనను దేశం మొత్తం చేయాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేస్తున్నారన్నారు. వెనుకబడిన వర్గాలకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకుంటామా అని ప్రశ్నించారు. భారాస నేతలు సర్వేలో పాల్గొనరని.. అవహేళన మాత్రం చేస్తారని ఎద్దేవా చేశారు. సర్వేలో పాల్గొన్న వాళ్లకే కులగణనపై మాట్లాడే అవకాశం ఉందని పేర్కొన్నారు. "బీసీలకు 42 శాతం సీట్లు ఇచ్చేందుకు మా పార్టీ సిద్ధం. భారాస నేతలు వెనుకబడిన వర్గాలకు క్షమాపణలు చెప్పాలి. కులగణనలో ఏ తప్పు లేదు.. ఏదైనా తప్పు కనిపిస్తే నా దృష్టికి తీసుకురావాలి. సబ్‌ప్లాన్, పథకాల రూపకల్పనకు ఈ సర్వే ఉపయోగపడుతుంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కులగణన చేయాలని డిమాండ్ ఉంది. ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న దీన్ని మా ప్రభుత్వం పక్కాగా పూర్తి చేసింది. ఇందులో భాగంగా ప్రజలు ఇష్టపూర్వకంగా సమాచారం ఇచ్చారు. కులగణన చేయబోమని కేంద్రంలో భాజపా అఫిడవిట్ ఇచ్చింది. ఆ పార్టీ ఫ్యూడలిస్టిక్ పార్టీ" అని పొన్నం ప్రభాకర్ విమర్శించారు.

## దామరవంచ గురుకులంలో ఫుడ్ పాయిజన్.. రేవంత్ సర్కారుపై ధ్వజమెత్తిన హరీశ్‌రావు



మహబూబాబాద్ జిల్లా దామరవంచ గిరిజన గురుకులంలో ఫుడ్ పాయిజన్ జరిగి, విద్యార్థులు ఆసుపత్రి పాలు అయ్యారు. ఈ ఘటనపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. ఫుడ్ పాయిజన్ ఘటన కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని పేర్కొన్నారు.

2 లో

## ప్రధాని మోదీ ఫ్రాన్స్, అమెరికా పర్యటన షెడ్యూల్ ఖరారు



దిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ ఫ్రాన్స్, అమెరికా పర్యటనకు షెడ్యూల్ ఖరారైంది. ఈ నెల 10నుంచి 12వ తేదీ వరకు ఫ్రాన్స్ లోబీ 12, 13 తేదీల్లో అమెరికాలో ఆయన పర్యటిస్తారని కేంద్ర విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు. పారిస్‌లో జరిగే కృత్రిమ మేధ సదస్సులో పాల్గొనేందుకు ఈ నెల 10వ తేదీన మోదీ ఫ్రాన్స్‌కు బయల్దేరి వెళ్లనున్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ తో కలిసి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాక్షన్ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహిస్తారని తెలిపారు.

2 లో

# సంపాదకీయం

## కొత్త సీఈసీపై సుప్రీం నిర్ణయమేమిటి?

భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) తన విధులు రాజ్యాంగ నిష్ఠతో నిర్వహిస్తుందా? లేదు. అసంబద్ధంగా వ్యవహరిస్తూ అవహేళనకు గురవుతోంది. ఎంత బాధాకరం! అమిత ఆవేదనతో నేను ఈసీఐ పనితీరును ఆక్షేపిస్తున్నాను. ఎందుకు ఈ వ్యాకులత? ఒకప్పుడు ఈసీఐ కర్తవ్య పాలనను నిర్లజ్జగా అభిమానించేవాణ్ణి, గౌరవించేవాణ్ణి. నా వైఖరిని ఎవరు తప్పుపట్టినా లెక్కచేసేవాణ్ణి కాదు. భారతదేశ ఎన్నికల ప్రజాస్వామ్య ఆదర్శప్రాయ విజయాలను ప్రపంచానికి తెలియజేసేందుకు సమస్త దేశాల ఎన్నికల కమిషనర్ల సదస్సును నిర్వహించమని కూడా మన ఈసీఐకి నేను ఒకప్పుడు విజ్ఞప్తి చేశాను. నా సూచన ఈసీఐకి ఒక సామాన్య పౌరుని కితాబుగా భావించాను. అయ్యో! ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. మౌనంగా ఉండలేను. అలా ఉండడమంటే మన గొప్ప రాజ్యాంగ సంస్థ భారత ప్రజాస్వామ్య ప్రస్థానంలో నిర్వహించిన ఘనతర పాత్రను అగౌరవించడమే అవుతుంది. అంతకంటే ముఖ్యంగా మన ప్రజాస్వామ్య పురోగమనానికి ఎదురవుతున్న సవాళ్లు, సమస్యలను ఉపేక్షించడమే అవుతుంది.

రాజీవ్ కుమార్ (భారత ఎన్నికల సంఘం 25వ ప్రధానాధికారి %–% సీఈసీ) ఈ మాసాంతంలో పదవీ విరమణ చేయనున్న తరుణాన మన రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థ ఒక కఠిన ప్రత్యామ్నాయాన్ని ఎదుర్కొంటున్నది: రాజ్యాంగ నిబద్ధత, లేదంటే రాజకీయ సంక్షోభం. మరింత స్పష్టంగా చెప్పాలంటే నిష్పాక్షికత, తటస్థత, పారదర్శకత ప్రస్ఫుటంగా ఉన్న న్యాయబద్ధమైన పద్ధతి ద్వారా కొత్త సీఈసీ ఎంపిక జరగాలి. లేనిపక్షంలో మనం ఒక ఎడతెగని రాజకీయ సంక్షోభంలో చిక్కుకోవడం అనివార్యమవుతుంది. మన ఇరుగు పొరుగు దేశాలలో వలే ఎన్నికల ఫలితాలు సదా వివాదాస్పదమవుతాయి ఇటువంటి పరిస్థితి మనకు మేలుచేస్తుందా? నిస్సందేహంగా సిగ్గుచేటు అవుతుంది.

ఈ శోచనీయ పరిస్థితికి రాజీవ్ కుమారే పూర్తిగా కారకుడు కాదు. ఒకప్పుడు తన విధ్యుక్త ధర్మాన్ని విలక్షణంగా నిర్వర్తించిన భారత ఎన్నికల సంఘం ప్రస్తుత అవనతికి ఆయన వ్యక్తిగతంగా బాధ్యుడు కానే కాదు. ఒక సుదీర్ఘ పతన క్రమం పరాకాష్ఠ దశలో ఆయన నిర్వాచన్ సదన్ (ఈసీఐ కార్యాలయం)కు సీఈసీగా వచ్చారు. తొలి నాలుగు దశాబ్దాల ప్రస్థానంలో ఈసీఐ ఏకసభ్య సంఘంగా ఉండేది. అయితే భారత ప్రభుత్వ విస్తరణ వ్యవస్థగా మాత్రమే వ్యవహరించేది. భారత రాజ్యాంగం తనకు సంక్రమింపచేసిన అధికారాలను చాలా చాలా అరుదుగా మాత్రమే వినియోగించింది. ఎన్నికలలో అక్రమాలపైన, అధికార భారత జాతీయ కాంగ్రెస్ పట్ల ఎన్నికల సిబ్బంది పక్షపాత వైఖరిపైన ఫిర్యాదులు వెల్లువెత్తుతూనే ఉండేవి. అయితే 1972లో పశ్చిమ బెంగాల్ శాసనసభా ఎన్నికలలో పెద్ద ఎత్తున చోటుచేసుకున్న అవకతవకల పైన, 1987 జమ్మూ%–%కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ స్వేచ్ఛగా, సక్రమంగా లేక పోవడంపైన ఆరోపణలు తీవ్ర స్థాయిలో వచ్చాయి. ఈ రెండు సందర్భాలలో మినహా మరెప్పుడూ ఎలాంటి వివాదాలు ఈసీఐకి చిక్కులు కల్పించలేదు. ఉపేక్షా భావంతో వాటిని అధిగమించగలిగింది. పాలనా పరంగా ప్రభుత్వానికి లోబడి ఈసీఐ వ్యవహరించింది. అయితే ఏనాడూ పాలకపక్షానికి లోబడి, దానికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకోలేదు, వ్యవహరించలేదు.

అప్పుడు తిరునెళ్ళై నారాయణ అయ్యర్ శేషన్ (టిఎన్ శేషన్‌గా సుప్రసిద్ధుడు) రంగప్రవేశం చేశారు. భారత ఎన్నికల సంఘంకు ఆయన 10వ ప్రధానాధికారి (1990 %–%96). ఎన్నికల సంఘంకు భారత రాజ్యాంగం కల్పించిన అధికారాలు అన్నిటినీ ఆయన సంపూర్ణంగా చెలాయించారు. శేషన్ ప్రజాస్వామ్యవాది కాదు. నిరంకుశుడు. జగడాలమారి. తెంపరితనంతో వ్యవహరించడం ఆయన స్వాభావిక లక్షణం. పాత ఆనవాయితీలకు స్వస్తి చెప్పారు. ఈసీఐలో భారీ సంస్కరణలు తెచ్చారు. ఎన్నికల సంఘానికి ఒక కొత్త గుర్తింపునిచ్చారు. కర్తవ్య పరాయణతలో కొత్త పుంతలు తొక్కారు. దేశ ప్రజలలో ఒక అపూర్వ ప్రజాస్వామిక చైతన్యాన్ని రగుల్కొలిపారు. అయితే రాజ్యాంగ అవధులు మీరుతున్నారా అన్న భావనకు కూడా శేషన్ ఆస్కారం కల్పించారు. సర్వోన్నత న్యాయస్థానం ఆక్షేపించింది. ఎన్నికల సంఘంలో మరో ఇద్దరు కమిషనర్‌లను నియమించాలని ఆదేశించింది. ఈ చర్యలతో శేషన్ దూకుడుకు కళ్ళెం పడింది. ఆయన తెంపరితనాన్ని సంయమనపరిచింది. ఏతావాతా మేల్కొన్న సింహంలా భారత ఎన్నికల సంఘం నికార్సయిన స్వతంత్రతతో పనిచేయడం ప్రారంభించింది. ఈ చైతన్యశీలత 2004 వరకు కొనసాగింది. శేషన్ అనంతరం సీఈసీలు అయిన ఎమ్ఎస్ గిల్, జెఎమ్ లింగ్డోలు తమ పూర్వీకుని నాటకీయతలకు పోకుండా తమ విధ్యుక్త ధర్మాన్ని రాజ్యాంగ నిష్ఠతో నిర్వర్తించారు. ఈసీఐ స్వతంత్రతను నిలబెట్టారు. విధి నిర్వహణలో కచ్చితమైన తటస్థత పాటించారు. ఎన్నికల నిబంధనలను పాటించని రాజకీయవేత్తలను చట్టంతో జడిపించారు, అదుపు చేశారు. 2002 గుజరాత్ శాసనసభ ఎన్నికల సందర్భంగా ఇది బాగా ప్రస్ఫుటమయింది. ఈసీఐ చరిత్రలో శేషన్ నుంచి లింగ్డో హయాం దాకా స్వర్ణ యుగం. ఈ కాలంలోనే అధికారంలో ఉన్న ప్రభుత్వాలు పరాజయాల పాలు కావడం, సంకీర్ణ ప్రభుత్వాలు అధికారంలోకి రావడం అధికమయింది. 2004 నుంచి 2018 దాకా ఈసీఐ వివాదాలకు తావివ్వకుండా మామూలు రీతిలో ప్రస్థానించింది. శేషన్, ఆయన తరువాయి సీఈసీలు సాధించిన మార్పులను మరింత ముందుకు తీసుకువెళ్లి, ఎన్నికల క్రీడలో రాజకీయ ఆటగాళ్లు అందరికీ సమాన అవకాశాలు కల్పించడంపై పెద్దగా శ్రద్ధ పెట్టకుండా భద్రంగా వ్యవహరించింది. అయితే సరైన మార్గంలోనే సాగింది. ప్రస్తావిత కాలంలో సీఈసీలు పాలకులు, పాలకపక్షంతో ఘర్షణ పడకుండా వ్యవహరించారు. అయితే ఈసీఐ స్వతంత్రత ఒక ప్రమాణంగా స్థిరపడింది. స్వతంత్ర ప్రతిపత్తితో వ్యవహరించడం ఒక అలవాటు అయింది. అయితే ఆనవాయితీలను పాటించడం మాటున విలువలు క్షీణ ముఖం పట్టడం ప్రారంభమయింది. రాజకీయ తటస్థతనుంచి ఈసీఐ పక్కదారులకు వెళ్లింది. క్షీణపతనాలు కనిపించకపోయినా ఆరంభమయ్యాయి. డిసెంబర్ 2018లో సీఈసీగా సునీల్ అరోరా నియామకంతో, సంస్థాగత స్వతంత్రత కోల్పోయిన, రాజకీయ తటస్థతకు తిలోదకాలు ఇచ్చిన ప్రస్తుత దశలోకి సీఈసీ ప్రవేశించింది. ఆ తరువాత అశోక్ లావాసా, అరుణ్ గోయెల్ ఉదంతాలతో ఎన్నికల సంఘంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసేందుకు ఏ మాత్రం ఆస్కారం లేనటువంటి పరిస్థితి నెలకొన్నది. ఈ శోచనీయ స్థితిని రాజీవ్ కుమార్ మరింత ముందుకు తీసుకువెళ్లారు. భిన్నభిప్రాయాన్ని వ్యక్తం చేయకపోవడం నుంచి పాలకులతో కుమ్మక్కయ్యే దశకు ఆయన చేరుకున్నారు! ప్రస్తుత సీఈసీ నిర్ణయాలు రాజ్యాంగ నిబద్ధతతో తీసుకున్నవేనా? నిశితంగా పరిశీలించడం అవశ్యం. ఈశాన్య భారత రాష్ట్రమైన అసోంలో పార్లమెంటరీ, శాసనసభా నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో ఆయన నిష్పాక్షికంగా ప్రవర్తించలేదు. పూర్తిగా భారతీయ జనతా పార్టీకి అనుకూలంగా వ్యవహరించారు. ఒక అరుదైన, వివాదాస్పద 'పోటీ రహిత' పార్లమెంటరీ ఎన్నికలను పర్యవేక్షించారు (గత సార్వత్రిక ఎన్నికలలో సూరత్ నియోజకవర్గంలో ఏమి జరిగిందో గుర్తు చేసుకోండి). తద్వారా ఆయన నేతృత్వంలో మన ఎన్నికల సంఘం అపారదర్శకతను కొత్త ఎత్తులకు తీసుకువెళ్లింది. ఎంత మంది ఓటర్లు పోలింగ్‌లో పాల్గొన్నారు, పోలయిన ఓట్లు, లెక్కించిన ఓట్ల సంఖ్య మధ్య అంతరం... సంబంధిత విషయాలపై సమాచారాన్ని సకాలంలో వెల్లడించలేదు.

# ఎమ్మెల్సీ తీన్మార్

# మల్లన్నపై కేసు నమోదు

మొదటిపేజీ తరువాయి

మల్కాజ్‌గిరి, ఫిబ్రవరి 7 : కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై అల్వాల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్ కథనం ప్రకారం.. ఫిబ్రవరి 4న వరంగల్‌లో జరిగిన బీసీ సభలో ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న.. అగ్రవర్ణాలపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వరంగల్ సభలో చేసిన వ్యాఖ్యలపై వివరణ కోరుతూ పీసీసీ క్రమశిక్షణా కమిటీ.. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు టీపీసీసీ షోకాజ్ నోటీసులు గురువారం జారీ చేసిన సంగతి తెలిసిందే. కుల గణన నివేదికపై మల్లన్న కీలక వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసింది. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కుల గణన నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. కుల గణన సర్వేలో బీసీల సంఖ్య తగ్గించినట్లుగా చూపించడంపై ఆయన సొంత ప్రభుత్వంపైనే తీవ్రంగా విమర్శించారు.

సర్వేను తప్పుపడుతూ తీవ్ర పదజాలంతోనే సొంత పార్టీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. కుల గణన నివేదికను సైతం తగులబెట్టాలని పిలుపునిచ్చారు. సొంత పార్టీ ఎమ్మెల్సీ చేసిన వ్యాఖ్యలు సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి. బీసీ జనాభా తగ్గడంపై ఇప్పటికే ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నాయి. ఈ క్రమంలోనే మల్లన్న చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీని తీవ్ర విమర్శల పాలు చేసింది. తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకున్న టీపీసీసీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

## ప్రధాని మోదీ ఫ్రాన్స్, అమెరికా పర్యటన షెడ్యూల్ ఖరారు

మొదటిపేజీ తరువాయి

కెడారచీ థర్మో న్యూక్లియర్ ఎక్స్‌పెరిమెంటల్ రియాక్టర్‌ను ప్రధాని పరిశీలించనున్నారని మిస్రీ తెలిపారు. అనంతరం 12వ తేదీ సాయంత్రానికి వాషింగ్టన్ డీసీకి చేరుకోనున్న మోదీ.. 13వ తేదీన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో భేటీ అవుతారని సమాచారం. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి భేటీ కాబోతున్న ప్రధాని మోదీ.. ఈ సందర్భంగా ఆయనతో పలు అంశాలపై ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశముంది. పలు దేశాలపై ట్రంప్ టారిఫ్‌లు విధిస్తున్న నేపథ్యంలో మోదీ అమెరికా పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

## వడ్ల వీధిలో మిషన్ భగీరథ కొళాయిలు

### ఒకే దగ్గర 5 బిగించడంపై అధికారుల నిర్లక్ష్యం



గద్వాల పట్టణంలోని వడ్ల వీధిలో మిషన్ భగీరథ పథకం కింద తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన కొళాయిలను ఒకే చోట ఐదు వరకు బిగించడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కొళాయిల ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శిస్తున్నారు. ఒకే చోట ఐదు కొళాయిలు.. వృథాగా నీరుమిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలనేది ప్రభుత్వ లక్ష్యం. అయితే, ఇక్కడ మాత్రం ఒకే చోట ఐదు కొళాయిలను ఏర్పాటు చేశారు. దీనివల్ల నీరు వృథాగా పోవడంతోపాటు, ప్రజలకు ఉపయోగకరంగా లేకుండా పోతున్నాయి. అధికారుల నిర్లక్ష్యమే కారణంఈ కొళాయిల ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. సరైన ప్రణాళిక లేకుండా, క్షేత్రస్థాయి పరిశీలన చేయకుండానే కొళాయిలను ఏర్పాటు చేశారని అంటున్నారు. ప్రజల ఆగ్రహం : ఈ విషయంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీటిని వృథా చేయడం సరికాదని, వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. స్పందించని అధికారులుఈ సమస్యపై స్థానిక అధికారులు మాత్రం ఇంకా స్పందించలేదు. దీనిపై వారి వివరణ కోసం వేచి చూడాల్సి ఉంది. ప్రభుత్వ లక్ష్యానికి విరుద్ధమని మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఈ ఘటన విరుద్ధంగా ఉంది. వెంటనే దీనిపై చర్యలు తీసుకుని, ప్రజలకు నీటిని సక్రమంగా అందించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

## మీ సేవ కేంద్రాల్లో కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తుల స్వీకరణ




హైదరాబాద్: తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల కోసం మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. లబ్ధిదారుల నుంచి రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించాలని మీ సేవ కమిషనర్‌ను పౌరసరఫరాలశాఖ కోరింది. కొత్త రేషన్ కార్డుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా విపరీతంగా డిమాండ్ ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొత్త కార్డుల జారీ ప్రారంభించినప్పుడు.. ఎంపిక చేసిన గ్రామాల్లో సుమారు లక్ష కార్డులను పంపిణీ చేసింది. ఇప్పటికీ చాలా మంది కొత్త రేషన్‌కార్డులు కావాలని, ఉన్న కార్డుల్లో మార్పులు చేర్పులు చేయాలని కోరుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన వార్డు, గ్రామ సభలు, ప్రజా పాలనలో భాగంగా సుమారు 10 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికీ దరఖాస్తుల వెల్లువ కొనసాగుతోన్న నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మీ సేవ కేంద్రాల ద్వారా కూడా దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని మీ సేవ కమిషనర్‌ను కోరింది. రేషన్ కార్డులకు సంబంధించిన డేటాబేస్‌ను మీ సేవతో అనుసంధానం చేయాలని ఎన్ఐసీని ప్రభుత్వం ఆదేశించింది. లబ్ధిదారులు ఇప్పటికే ఇచ్చిన దరఖాస్తులన్నీ ప్రభుత్వం వద్ద ఉన్నాయని, దరఖాస్తు చేయని వారు మాత్రమే మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. రేషన్ కార్డుల మంజూరుకు సంబంధించిన మార్గదర్శకాలను ఇప్పటికే ప్రభుత్వం విడుదల చేసింది.

## కేజ్రీవాల్‌కు ఏసీబీ నోటీసులు.. ఫలితాలకు ముందు రాజధానిలో

దిల్లీ: దేశ రాజధానిలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ముందు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆప్ ఎమ్మెల్యే అభ్యర్థులకు భాజపా ఎరవేస్తోందని కేజ్రీవాల్ చేసిన ఆరోపణలపై విచారణ చేపట్టాలని లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశించారు. దీంతో తక్షణమే రంగంలోకి దిగిన ఏసీబీ బృందం ఆప్ అధినేత కు లీగల్ నోటీసు పంపించింది. ఈ ఆరోపణలకు సంబంధించి ఆధారాలు చూపాలని అందులో పేర్కొంది. ఎన్నికల ఫలితాలకు ముందు రోజే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. పార్టీ మారేందుకు 16 మంది ఆప్ అభ్యర్థులకు భాజపా లంచాలు ఇవ్వజూపిందంటూ కేజ్రీవాల్ ఎక్స్‌లో చేసిన పోస్టును ప్రస్తావిస్తూ.. ఆ ట్వీట్ చేసింది మీరేనా? అని నిర్ధరించాలని ఏసీబీ పేర్కొంది. ఆ ఆరోపణలకు సంబంధించి పూర్తి సమాచారం ఇవ్వాలని కోరింది. ఫోన్ కాల్ అందుకున్న ఆ 16మంది అభ్యర్థులు ఎవరు? వారికి వచ్చిన నంబర్లు, సంబంధిత సమాచారాన్ని అందించాలని తెలిపింది. దీంతోపాటు దిల్లీ ప్రజల్లో ఆందోళనలు రేకెత్తించేలా ఆరోపణలు చేస్తున్నందుకు చట్టపరమైన చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరించాలని హెచ్చరించింది. ఇంటిముందు హైడ్రామా..ఆప్ ఎమ్మెల్యే అభ్యర్థులకు ఎరవేసి, తమ పార్టీని అస్థిరపరచేందుకు భాజపా ప్రయత్నాలు చేస్తోందని అరవింద్ కేజ్రీవాల్ ఇటీవల ఆరోపించారు. ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా.. ఏసీబీ విచారణకు ఆదేశించారు. దీంతో వెంటనే రంగంలోకి దిగిన అవినీతి నిరోధక శాఖ అధికారుల బృందం.. ఫిరోజ్‌షా రోడ్డులో ఉన్న కేజ్రీవాల్ నివాసానికి వెళ్లింది. ఈ చర్యలను తీవ్రంగా వ్యతిరేకించిన ఆప్ నేతలు.. ఏసీబీ అధికారులను లోపలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. అమెరికా బహిష్కరణ జాబితాలో 487 మంది భారతీయులు! – విదేశాంగశాఖ ఎటువంటి లీగల్ నోటీసులు లేకుండా అధికారులు వచ్చారని, గంటన్నర తర్వాత నోటీసులు అందించారని ఆప్ లీగల్ సెల్ అధ్యక్షుడు సంజీవ్ నాసియార్ పేర్కొన్నారు. భాజపాతో కలిసి ఎల్జీ ఈ డ్రామా నడిపిస్తున్నారని ఆరోపించారు.

## ద్వితీయ.. తృతీయ శ్రేణి నగరాలకు పరిశ్రమలు విస్తరించాలి: మంత్రి శ్రీధర్‌బాబు




మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణలో డ్రోన్ టెక్నాలజీ విస్తరణకు పలు సంస్థలు ముందుకొచ్చాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ ఏడాది కొత్తగా 500 ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. సెంటిలియాన్, హెచ్‌పీ రోబోటిక్స్ సంస్థల ప్రతినిధులు శుక్రవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబును కలిశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపన, పెట్టుబడులను ఆకర్షించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు. పెట్టుబడులు పెట్టాలనుకునే వారికి నమ్మకం కలిగించే విధంగా పారిశ్రామిక విధానాలు రూపొందిస్తున్నామన్నారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకూ పరిశ్రమలు విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.

## భయభ్రాంతులకు గురి చేసేందుకు కొందరు యత్నిస్తున్నట్లుంది

మొదటిపేజీ తరువాయి

పటాన్‌చెరు అర్బన్: సంగారెడ్డి జిల్లా ఐలాపూర్‌లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ శుక్రవారం పర్యటించారు. స్థానికంగా ఉన్న ఓ ప్లాట్ అసోసియేషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగనాథ్ అక్కడికి వెళ్లారు. తమ ప్లాట్లు కబ్జా చేస్తున్నారంటూ బాధితులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఐలాపూర్‌లో పర్యటించిన హైడ్రా కమిషనర్.. బాధితుల సమస్యలు విన్నారు. ఈ క్రమంలో హైకోర్టు న్యాయవాది ముఖీం జోక్యం చేసుకోవడంతో వారిద్దరి మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది.

అనంతరం రంగనాథ్ స్పందిస్తూ.. "భయభ్రాంతులకు గురి చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నట్లు ఉంది. రెండు వారాల్లో లోతుగా పరిశీలించి ఇరువర్గాలు చెప్పింది వింటాం. కోర్టు పరిధిలో ఉన్న అంశాలనూ పరిగణనలోకి తీసుకుంటాం. అన్ని అంశాలను పరిశీలించి 2 నెలల్లో సమస్యను పరిష్కరిస్తాం" అని తెలిపారు.

## మస్తాన్ సాయి కేసు.. రంగంలోకి యాంటీ నార్కోటిక్స్ పోలీసులు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: యువతుల ప్రైవేటు వీడియోలను సేకరించి బెదిరింపులకు పాల్పడుతున్న వ్యవహారంలో అరెస్టయిన మస్తాన్ సాయి కేసులో యాంటీ నార్కోటిక్స్ పోలీసులు రంగంలోకి దిగారు. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. మస్తాన్ సాయి డ్రగ్స్ దందాపై ఈ టీమ్ ఆరా తీస్తోంది. ఇప్పటికే కీలక ఆధారాలు సేకరించింది. టాస్క్‌ఫోర్స్‌తో కలిసి సైబరాబాద్ నార్కోటిక్ బ్యూరో పనిచేస్తోంది.

ఇప్పటికే లావణ్య ఫిర్యాదుతో మస్తాన్ సాయిని పోలీసులు అరెస్టు చేశారు. అతడిని నార్సింగి పోలీసులు ఏడు రోజుల కస్టడీకి కోరారు. కస్టడీ విచారణలో తెలంగాణ న్యాబ్ పోలీసులు పాల్గొననున్నారు. మస్తాన్ సాయి డ్రగ్స్ పార్టీల్లో పాల్గొన్న వారికీ అధికారులు నోటీసులు ఇవ్వనున్నారు

## దామరవంచ గురుకులంలో ఫుడ్ పాయిజన్.. రేవంత్ సర్కారుపై ధ్వజమెత్తిన హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి

ఏడాది కాంగ్రెస్ పాలనలో ఒకటి కాదు రెండు కాదు గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ కేసులు వందల్లో జరిగాయన్నారు. వందల మంది విద్యార్థులు ఆసుపత్రి పాలు కాగా, పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారన్నారు.

కల్తీ ఆహారం విద్యార్థులకు పెడితే అరెస్టులు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించారని.. అయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా గురుకులాల తీరు ఉందంటూ మండిపడ్డారు. సీఎం రేవంత్ మాటలు కోటలు దాటితే, ఆచరణ గడప దాటదు అనేందుకు గురుకులాల దీన స్థితే నిదర్శనమంటూ చురకలంటించారు. ఆసుపత్రి పాలైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, ఫుడ్ పాయిజన్ కేసులు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# జాగ్రత్తలు పాటిస్తే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చు: సీపీ సుధీర్ బాబు

**– సత్వర స్పందన ద్వారా నష్టతీవ్రతను తగ్గించవచ్చు**
**– అధికారులు మరియు సిబ్బంది విపత్తు నిర్వహణ విధానాల మీద సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి**







**కరపత్రం రంగారెడ్డి జిల్లా హైదరాబాద్, ఫిబ్రవరి 7.** ఇటీవల తరచుగా అగ్ని ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలో విపత్తు నిర్వహణ కొరకు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలు మరియు నష్ట నివారణ కొరకు తీసుకోవాల్సిన అత్యవసర చర్యల గురించి అవగాహనా కల్పించారు. అందులో భాగంగా కమిషనర్ శ్రీ సుధీర్ బాబు ఐపిఎస్ రాచకొండ కార్యాలయంలో రాచకొండ డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసిపిలు కమిషనరేట్ పరిధిలోని పలువురు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విపత్తు నిర్వహణ చర్యల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ పెట్రోలియం సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ విపత్తు నిర్వహణ బృంద ప్రతినిధులు తాము పాటించే విపత్తు నిర్వహణ విధానాల గురించి వివరించారు.

ఈ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు అనేవి ఆకస్మాత్తుగా సంభవించేవని, సరైన అవగాహన లేకపోవడం వల్ల ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా జరిగే ప్రాణనష్టం, ఆస్తినష్టం అత్యధికంగా ఉంటుందని పేర్కొన్నారు. కర్మాగారాల్లో, పారిశ్రామిక వాడల్లో అకస్మాత్తుగా జరిగే అగ్నిప్రమాదాలను అదుపు చేయడంలో సరైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల మరియు విపత్తు నిర్వహణ బృందాలకు సత్వరమే సమాచారం అందించకపోవడం వల్ల నష్టం మరింతగా పెరుగుతోందని తెలిపారు. పారిశ్రామిక వాడల్లో జరిగే బాయిలర్ పేలుళ్ల వల్ల సమీప కర్మాగారాలకు మంటలు అంటుకోవటంతో ప్రాణనష్టం, ఆస్థినష్టం అధికంగా జరుగుతోందని అన్నారు. పెట్రోలియం కర్మాగారాల్లో జరిగే ప్రమాదాలు మరియు పెట్రోలియం ఉత్పత్తులను ట్యాంకర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు సరఫరా చేసే సమయంలో జరిగే రోడ్ల ప్రమాదాలలో సంభవించే అకస్మాత్తుగా భారీ అగ్నిప్రమాదాల వల్ల సామాన్య ప్రజల వాహనాలు మంటల్లో చిక్కుకోవడంతో పాటు భారీస్థాయిలో ట్రాఫిక్ జామ్ వంటి పరిస్థితులు కూడా ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.

సంఘటనా స్థలానికి వీలైనంత తక్కువ సమయంలో చేరుకోవడం ద్వారా ప్రమాద తీవ్రతను తగ్గించవచ్చని కాబట్టి అధికారుల స్పందన వేగంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో అత్యవసర విపత్తు నిర్వహణలో పాల్గొనే సిబ్బంది తగిన జాగ్రత్తలు తగిన శిక్షణ తీసుకోకపోవడం వల్ల వారు కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉందని కాబట్టి వారు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. విపత్తు నిర్వహణ కొరకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అందరూ అవగాహన పెంచుకోవాలని, అధికారులు తమ సిబ్బందికి ఎప్పటికప్పుడు అంతర్గత శిక్షణ కార్యక్రమాల ద్వారా శిక్షణ ఇవ్వాలని సూచించారు. పెట్రోలింగ్ వాహనాల్లో విపత్తు నిర్వహణ కిట్లను అందుబాటులో ఉంచాలని, విపత్తు నిర్వహణ, అగ్ని మాపక సేవల శాఖ ద్వారా రాచకొండ పరిధిలో నివాస గృహాలు, పరిశ్రమలు, పాఠశాలలు, గోదాములు, షాపింగ్ కాంప్లెక్స్ లు, ఇతర ప్రదేశాల్లో అకస్మాత్తుగా సంభవించే అగ్ని ప్రమాదాలను నివారించడానికి అవగాహన కార్యక్రమాలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి విపత్తు నిర్వహణ ప్రమాణాల ప్రకారం జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి అగ్ని ప్రమాదం జరిగినా తక్షణమే 101 టోల్ ఫ్రీ నంబర్ ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ మల్కాజ్గిరి పద్మజ ఐపిఎస్, డిసిపి యాదాద్రి రాజేష్ చంద్ర ఐపిఎస్, డిసిపి ఎల్బీనగర్ ప్రవీణ్ కుమార్ ఐపిఎస్, డిసిపి క్రైమ్ అరవింద్ బాబు, డిసిపి మహేశ్వరం సునీత రెడ్డి, డిసిపి ఎస్ఓటి రమణారెడ్డి, ఎస్బి డిసిపి నరసింహారెడ్డి, డీసీపీ ట్రాఫిక్ శ్రీనివాస్, డిసిపి అడ్మిన్ ఇందిర, అదనపు డీసీపీ అడ్మిన్ శివకుమార్, ఏసిపి ఐటి సెల్ నరేందర్ గౌడ్, ఏసిపి సి.సి.ఆర్.బి రమేష్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పలు వేడుకల్లో పాల్గొన్న దుద్దిళ్ల శ్రీనుబాబు






**కరపత్రం రామగిరి ప్రతినిధి, ఫిబ్రవరి 7.**
శుక్రవారం రోజు రామగిరి మండలంలోని హనుమాన్ ట్రేడర్స్ (ఐరన్ & సిమెంట్) షాప్ ను ప్రారంభించిన దుద్దిళ్ల శ్రీను బాబు. రామగిరి మండల బేగంపేట్ ఎక్స్ రోడ్ లోని హనుమాన్ ట్రేడర్స్ (ఐరన్ & సిమెంట్) షాప్ ను ప్రారంభించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రామగిరి మండల రత్నాపూర్ గ్రామంలోని లక్ష్మి గార్డెన్స్ లో నాగేపెల్లి గ్రామానికి చెందిన నిడిగొండ రాజేశ్వరి – కీర్తిశేషులు సాంబయ్య కూతురు లలిత –మధుకర్ ల వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన దుద్దిళ్ల శ్రీను బాబు. ఈ కార్యక్రమంలో రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ ద్వార పూజలు.

**కరపత్రం రామగిరి ప్రతినిధి ఫిబ్రవరి 7.**



రామగిరి మండలం కల్వచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని ప్రశాంత్ నగర్ లో నూతనంగా నిర్మిస్తున్న అభయాంజనేయ స్వామి ఆలయ ద్వార పూజలను శుక్రవారం వేద పండితులు నిర్వహించారు. ప్రశాంత్ నగర్ వాసులు నిర్మించుకుంటున్న ఈ ఆలయానికి వేద పండితులు చంద్రశేఖర శాస్త్రి శ్రీనివాస చార్యుల ఆధ్వర్యంలో కొత్తపల్లి రామారావు సూర్య కుమారీలు ప్రతిష్టాపన కార్యక్రమంలో పూజలు నిర్వహించారు. త్వరలోనే ఆలయ పనులు పూర్తి అవుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు కంటిపూడి రామకృష్ణ వెంకటేశ్వరరావు కృష్ణారావు శ్రీనివాస్ రవి సత్యనారాయణ రాంబాబు పర్వతనేని శ్రీనివాస్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ శాసనసభ సభ్యత్వం రద్దు చేయాలి..

**– మాజీ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండి సాహెబ్ హుస్సేన్..**



**కరపత్రం ప్రతినిధి,వీణవంక, ఫిబ్రవరి 7.**
తెలంగాణ రాష్ట్రంలో 2023 డిసెంబర్ 9వ తేదీన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి టిఆర్ఎస్ పార్టీ అధినేత శాసనసభ్యులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు శాసనసభకు రావడంలేదని తన శాసన సభ్యత్వాన్ని స్పీకర్ రద్దు చేయాలని మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఎండీ సాహెబ్ హుస్సేన్ అన్నారు. పది సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసి ప్రజా సమస్యల పట్ల ప్రతిపక్ష హోదాలో అసెంబ్లీలో మాట్లాడవలసిన ప్రతిపక్ష నేత కెసిఆర్ సభకు పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి సలహాలు సూచనలు చేయవలసిన కెసిఆర్ సభకు రాకుండా ఫామ్ హౌస్ కే పరిమితమైన వారికి శాసనసభ్యునిగా ఉండే అర్హత లేదు తక్షణమే వారి శాసనసభ్యత్వాన్ని రద్దు చేయాలని ఎండి సాహెబ్ హుస్సేన్ ఒక ప్రకటనలో కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల మన్నలను పొందుతుంటే అది చూసి ఓర్వలేని కెసిఆర్ కాలేశ్వరం పేరట కమిషన్లు దండుకొని గత ప్రభుత్వం ఏ పథకం ప్రవేశపెట్టిన అందులో కేసీఆర్ గారికి వాటాలు ఉన్నాయని అసెంబ్లీకి వస్తే అవి ఎక్కడ బయటపడతాయని దిగులుతో అసెంబ్లీకి రావడం లేదు తక్షణమే తెలంగాణ రాష్ట్ర స్పీకర్ వారి సభ్యత్వాన్ని రద్దు పరచాలని కోరారు. ఈ కార్యక్రమం కర్ర తిరుపతి రెడ్డి, జున్నుతుల మధుకర్ రెడ్డి, ఈదునూరిపైడికుమార్,రాచపల్లి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలి....



**– ఎం ఎల్ హెచ్ పీ డాక్టర్ సురేష్..**

**కరపత్రం శంకరపట్నం ఫిబ్రవరి 7**
ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రతి ఒక్కరు వినియోగించుకొని ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందాలని డాక్టర్ సురేష్ కోరారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలంలోని ఎర్రడపల్లి గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో మహిళ శిశు సంక్షేమ శాఖ, ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు ఈ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ సురేష్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వ దావాఖానాలు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాయని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వము ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకొని, ప్రభుత్వ సేవలను వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ అరుణ, శోభ, స్వరూప, సుభద్ర, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, మహిళలు, చంటి పిల్లల తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా నర్సింగాపూర్ లో నాగ దేవత ప్రతిష్ట మహోత్సవం..

**– సింగిరెడ్డి సత్యనారాయణరెడ్డి– విజయలక్ష్మి దంపతులు..**

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, ఫిబ్రవరి 6.**




వీణవంక మండలం నర్సింగాపూర్ గ్రామంలో సింగిరెడ్డి ధర్మారెడ్డి గారి వ్యవసాయ క్షేత్ర భూమిలో గత కొన్ని సంవత్సరాల క్రితం బయటపడిన నాగదేవతను వారి కుమారుడు సింగిరెడ్డి సత్యనారాయణరెడ్డి– విజయలక్ష్మి దంపతుల చేత నూతన గుడిని నిర్మించి, శుక్రవారం అంగరంగ వైభవంగా వేద పండితుల చేత ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ గంగాడి సౌజన్య తిరుపతి రెడ్డి, హరిహర క్షేత్ర ఆలయ చైర్మన్ కొమ్మిడి వెంకట్ రెడ్డి, సింగిరెడ్డి సమ్మి రెడ్డి, ఉయ్యాల చంద్రమౌళి, పోతరవేన తిరుపతి రాచర్ల సుధాకర్,కాసనగట్టు కరుణాకర్,గిరవేన సమ్మయ్య సార్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రీ వెడ్డింగ్ షూట్ లు వద్దు

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

**– లంబాడాల తీర్మానం**




లంబాడా సామాజిక వర్గానికి చెందిన పెద్దలు కీలక తీర్మానం చేశారు. లంబాడాలు ఎవ్వరూ ప్రీవెడ్డింగ్ షూట్ నిర్వహించవద్దని అన్నారు. ఈ మేరకు ఓ తీర్మానం కూడా చేశారు. లంబాడీ గిరిజనుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భరత్ చౌహాన్ అధ్యక్షతన ఉట్నూరు కేంద్రంగా కీలక సమావేశం జరిగింది. అందులోనే ప్రీవెడ్డింగ్ షూట్ తమ సంప్రదాయాలకు విరుద్ధమని, పెళ్లికి ముందు ఇలాంటి షూట్ లు నిర్వహించవద్దని తీర్మానించారు. లంబాడీలు తమ పిల్లల వివాహం నిశ్చయమైనప్పుడు ప్రీవెడ్డింగ్ చేయకుండా నిషేధిస్తామన్నారు. వివాహం అయిన తర్వాత ఆసక్తివుంటే పోస్ట్ వెడ్డింగ్ షూట్ చేసుకోవాలని సూచించారు. హల్ది ఫంక్షన్ చేయవద్దని, డీజే ఉపయోగించవద్దని కూడా తీర్మానించారు. లంబాడీ సంస్కృతికి అద్దం పట్టే విధంగానే వివాహాలు చేసుకోవాలని తీర్మానించారు. లంబాడా సంఘాలు తీసుకున్న నిర్ణయాన్ని విశ్వ హిందూ పరిషత్ నేషనల్ స్పోక్స్ పర్సన్ శ్రీ రావినూతల శశిధర్ గారు స్వాగతించారు. మిగతా హిందువులు కూడా ఇలా నిర్ణయం తీసుకోవాలని అన్నారు. పురుషులతో చీరలు కట్టించుకోవడం, మెహెంది పెట్టించుకోవటం మానాలి అని శశిధర్ గారన్నారు.

# నిరుపేద కుటుంబానికి చేయూత అందించిన దాతలు

**కరపత్రం ప్రతినిధి, హుజురాబాద్ /వీణవంక, ఫిబ్రవరి 7.**



హుజరాబాద్ నివాసులు పట్టణ కేంద్రంలోని శిశు మందిర్ దగ్గర గల ప్రతాప్ వెంకటమ్మ– ఆదిరెడ్డి ల రెండవ కుమారుడు ప్రతాపు నాగరాజు వయసు 40 సంవత్సరాలు జీవనోపాధి నిమిత్తం హైదరాబాదుకు వెళ్లి సుతారిగా పనిచేస్తుండగా రెండు కిడ్నీలు ఫెయిల్ కావడం వల్ల గత శుక్రవారం రోజున మరణించాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా అంత్యక్రియలు డైరెక్ట్ గా స్మశాన వాటికలో అంత్యక్రియలు చేశారు. ఇప్పుడు 11 రోజుల కార్యక్రమం చేయలేని పరిస్థితిలో ఉండగా ఇంటి దగ్గరలో ఉన్న మునుగంటి రవీందర్ రిటైర్డ్ వర్క్ ఇన్స్పెక్టర్ ఎస్ ఆర్ ఎస్ పి 2000 రూపాయల నగదు మరియు గంగిశెట్టి జగదీశ్వర్ 25 కిలోల రైస్ బ్యాగు అందించారు. గతంలో వీరి కోడలు క్యాన్సర్ తో మరణించగా రవీందర్,జగదీశ్వర్ పదివేల రూపాయలు నగదు సహాయం చేసినారు. దాతలు ముందుకు వచ్చి తోచిన సహాయం చేయాలని కోరుతున్నారు ఈ కార్యక్రమంలో వీధిలోని ప్రజలు పాల్గొన్నారు.

# స్వతంత్ర అభ్యర్థికి మద్దతుగా పట్టభద్రులు...

**కరపత్రం శంకరపట్నం ఫిబ్రవరి 7**



పట్టభద్రుల ఎమ్మెల్సీగా స్వాతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న పట్టభద్రుడు గంగాధర్ కు మద్దతుగా శంకరపట్నం మండలం నుండి పట్టభద్రులు బయలుదేరి శుక్రవారం వెళ్లారు. ఈ సందర్భంగా పట్టబద్రుడు బొజ్జ బిక్షపతి మాట్లాడారు. అదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న పట్టభద్రుడు, విద్యావేత్త మధునం గంగాధర్ కు మద్దతుగా, గంగాధర్ నామినేషన్ కోసం కరీంనగర్ పట్టణానికి, శంకరపట్నం మండలంలోని పట్టభద్రులందరం ఏకధాటిగా బయలుదేరినట్లు బిక్షపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టభద్రులు బొజ్జ లింగస్వామి, లక్కిరెడ్డి, కొంకట చంద్రశేఖర్, రమేష్, సురేష్ తదితరులు ఉన్నారు.

# బీమా చట్ట సవరణ బిల్లు 2024 ను తిరస్కరించాలి

**- ఏఐఐఈఏ హుజురాబాద్ బ్రాంచ్ అధ్యక్షుడు బొంకూరి కుమార్ స్వామి**

**కరపత్రం-హుజురాబాద్:**






కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న 2024 బీమా చట్ట సవరణ బిల్లును ప్రతి ఒక్కరు తిరస్కరించాలని ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ) హుజురాబాద్ బ్రాంచ్ అధ్యక్షుడు బొంకూరి కుమార్ స్వామి కోరారు. బీమా చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ శుక్రవారం పట్టణంలో ప్రజలకు అవగాహన కల్పించారు. చట్ట సవరణ బిల్లు ద్వారా వచ్చే ఇబ్బందులను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం కుమార్ స్వామి మాట్లాడుతూ... రానున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో తిరోగమన బీమా సవరణ బిల్లు 2024 ను ప్రవేశ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పాలసీదారులకు, సాధారణ పౌరులకు, ప్రభుత్వ రంగ బీమా పరిశ్రమ ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఈ అనాలోచిత బీమా చట్ట సవరణలను పోరాటాల ద్వారా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ) నేతృత్వంలో బీమా ఉద్యోగులు బీమా చట్ట సవరణల బిల్లు 2024 కు వ్యతిరేకంగా తీవ్ర పోరాటానికి, సమ్మెతో 'సహా ఇప్పటికే సంసిద్ధంగా ఉన్నామన్నారు. భారతీయ బీమా పరిశ్రమకు ఏమాత్రము అవసరం లేని ఈ సవరణలు అటు భారతదేశ ఆర్థిక వ్యవస్థకు గాని, పాలసీదారులకు గాని ఎటువంటి ప్రయోజనాన్ని చేకూర్చక పోగా, బీమా పరిశ్రమకు తప్పకుండా ప్రతికూలంగా మారుతాయన్నారు. బీమా జాతీయకరణ జరిగిన 1956 కంటే ముందు దేశీయ బీమా రంగంలో నెలకొని ఉన్న ఆర్థిక మోసాలకు, పాలసీదారుల వంచన వంటి పరిస్థితులకు, ఈ సవరణలు తప్పక దారి తీస్తాయన్నారు. ఈ చట్ట సవరణ బిల్లును ప్రతిఒక్కరు తీవ్రంగా ప్రతిఘటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఐఈఏ బ్రాంచ్ కార్యదర్శి ఆకుల చందర్, పి శ్రీనివాస్, రిచిత్ రెడ్డి, అంజలి, ఆర్ కుమారస్వామి, ఏం. ప్రేమకుమార్, ఎల్ఐసి ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పూర్తిస్థాయిలో యంత్రాలను వినియోగించి, భద్రత తో లక్ష్యాలను అధిగమించాలి: ఆర్.జి-3 జి.యం.

**కరపత్రం రామగిరి ప్రతినిధి జనవరి 7**





యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించి భద్రత తో కూడిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించుకోవాలని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు అన్నారు.శుక్రవారం ఓసిపి-2 ఉపరితల గని నందు ట్రాక్టర్ ఇండియా లిమిటెడ్ కంపెనీ కి చెందిన 40 టన్నుల సామర్థ్యం గల సుమారు 1 కోటి 73 లక్షల విలువ చేసే నూతన క్రేన్ యంత్రాన్ని రామగుండం -3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త యంత్రాలను కొనుగోలు చేయుట కొరకు అనుమతులను మంజూరు చేసిన సంస్థ సంబంధిత అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు. సంబంధిత ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ యంత్రాలను పూర్తిస్థాయిలో ఉపయోగించుకొని భద్రత తో కూడిన ఉత్పత్తిని అందరము కలసికట్టుగా పనిచేసి సాధించుకోవాలని, యంత్రము లో ఏవైతే రక్షణ పరికరాలు అమర్చి ఉన్నాయో వాటిని అవసరము వచ్చినప్పుడు తూచా తప్పక ఉపయోగించి ప్రమాదాలు జరుగకుండా భద్రత తో పనిచేయాలని యంత్రంలో చిన్న మరమత్తు పని ఉన్నా త్వరగా రిపేరు చేయించుకోవాలని, భద్రత, జాగ్రత్త చర్యలను తూచా తప్పక పాటించాలని అన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను సాధిస్తూ సింగరేణి లోనే ఓసిపి-2 ముందు ఉండాలని అన్నారు.కార్యక్రమంలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్రరెడ్డి, రామిళ్ళ మనోహర్, ఏరియా ఇంజినీర్ వై.వి.శేఖర బాబు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ యం.రామ్మోహన్, ప్రాజెక్ట్ ఆఫీసర్ సి.హెచ్.వెంకటరమణ, ప్రాజెక్ట్ ఇంజనీర్ ఎం.వి.ఎన్.ఎ.చంద్రశేఖర్, మేనేజర్ కె.వి.రామారావు, బేస్ వర్క్ షాప్ ఇంఛార్జ్ ఉపేందర్, పిట్ కార్యదర్శి బి.పోషం, లతో పాటు ఇతర అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫౌండ్ చెక్కుల పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు...

**కరపత్రం శంకరపట్నం ఫిబ్రవరి 7**




ముఖ్యమంత్రి సహాయ నిధి చెట్లను లబ్ధిదారులకు అందజేసినట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి, గ్రామ తాజా మాజీ సర్పంచ్ బండారి స్వప్న తిరుపతి శు క్రవారం తెలిపారు. ఈ సందర్భంగా స్వప్న తిరుపతి మాట్లాడారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలం, కేశవపట్నం గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వైద్య ఖర్చుల నిమిత్త మంజూరైన చెక్కులను మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచన మేరకు లబ్ధిదారులకు, కుటుంబ సభ్యులకు అందజేసినట్లు తెలిపారు. గ్రామ శాఖ అధ్యక్షుడు మొలంగూరి సదానందం, యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు మొహ్మద్ హిస్సామొద్దిన్, టౌన్ అధ్యక్షుడు పూరేళ్ల ప్రశాంత్ గౌడ్ జిల్లా యూత్ నాయకులు బొంగోని శ్రావణ్ , ఎండి అరిఫ్, నాయకులు కృష్ణమూర్తి, అబిద్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# కోరిన కోరికలు తీర్చి భక్తుల ఇండ్లలో కొంగు బంగారమయ్యే...

**- శ్రీ మత్స్య గిరింద్ర స్వామి బ్రహ్మోత్సవాలు..**
**- సకల సదుపాయాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం...**
**- దేవాదాయ, ధర్మకర్తల మండలి పర్యవేక్షణ...**
**- 24 గంటలు రవాణా సౌకర్యం...**
**- కరీంనగర్ 25, హనుమకొండ 35 కొత్తగట్టుగుట్టకు దూరం..**
**- జాతీయ రహదారి ప్రక్కనే బ్రహ్మోత్సవాలు....**

**కరపత్రం శంకరపట్నం ఫిబ్రవరి 7**

కోరిన కోర్కెలు తీర్చి భక్తుల ఇండ్లలో కొంగు బంగారం వెలిసే శ్రీ మత్స్య గిరింద్ర స్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని ప్రభుత్వం దేవాదాయ ధర్మాదాయ శాఖ, ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో, బ్రహ్మోత్సవాలకు ముస్తాబు చేశారు. కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం, శంకరపట్నం మండలం కొత్తగట్టుగుట్టపై వెలసిన దశ అవతారాల్లోని ఒక అవతారమైన శ్రీ మత్స్య గిరింద్ర స్వామి 20 25 సంవత్సరం బ్రహ్మోత్సవాలు ప్రారంభం అయ్యాయి. నేడు శ్రీ మత్స్య గిరింద్ర స్వామి భూదేవి లీలాదేవిల కళ్యాణం వేద పండితుల మంత్రోత్సవాలు, ఆశేష భక్తజనం నడుమ ప్రభుత్వము తరపున మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రభుత్వము తరపున స్వామివారికి పట్టు వస్త్రాలు ముత్యాల తలంబ్రాలు అందజేయడం జరుగుతుంది. ఆనవాయితీగా ప్రతి ఏటా హుజురాబాద్ నియోజకవర్గం వీణవంక మండలం పోతిరెడ్డి పేటకు



చెందిన వంశస్థులు స్వామివారి తరపున హాజరవుతారు. గుట్ట పైన గల ఏర్పాటు చేసిన స్వామి వారి కళ్యాణ మండపంలో స్వామి వారి కల్యాణానికి,త్యంత భక్తి శ్రద్ధలతో తెలంగాణ నలుమూలల నుండి, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, భక్తులు హాజరై కళ్యాణ కార్యక్రమంలో పాత్రులవుతారు. పుట్ట పైన గల కోనేరుకు ఓ ప్రత్యేకత ఉంది. స్వామివారి బ్రహ్మోత్సవాల సమయంలో గుట్టపైన గల కోనేరులో స్నానమాచరిస్తే ఎలాంటి చర్మవ్యాధులు ఉన్న నయం అవుతాయని భక్తుల విశ్వాస నమ్మకం. నేటితో ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు ఈనెల 19 వరకు గుట్టపైన గల దేవాలయ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుంది. ఈ బ్రహ్మోత్సవాలకు కరీంనగర్ నుండి 25 కిలోమీటర్లు, హనుమకొండ వరంగల్ నుండి 35 కిలోమీటర్ల దూరం జాతీయ రహదారి పక్కనే గుట్ట గుట్ట పరిసరాల్లో తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేకంగా జాతర సమయంలో అన్ని బస్సులను నిలిపేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంది. గుట్ట పైన బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా షామియాలు, క్యూ లైన్ లో, స్వామివారి దర్శనం కు ప్రత్యేకంగా, వైద్యశాల, తాగునీరు, స్నానాలకు కోనేరు. ఏర్పాట్లను చేసి, గుట్ట పైన ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేశవపట్నం ఎస్ ఐ కొత్తపల్లి రవి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తులను, పోలీస్ టికెట్లను ఏర్పాటు చేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ, ధర్మకర్తల మండలి చైర్మన్ ఉప్పుగళ్ల మల్లారెడ్డి ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి సభ్యులు భక్తులు, నిత్యం గుట్టపైన పర్యవేక్షణ కొనసాగించడం జరుగుతుంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం ఏర్పడకుండా అన్ని ఏర్పాట్లను చేసినట్లు ఈవో సుధాకర్, ఆలయ చైర్మన్ ఉప్పుగళ్ల మల్లారెడ్డి తెలిపారు. కోరిన కోరికలు తీర్చి భక్తుల ఇండ్లలో కొంగుబంగారమై నిలిచే శ్రీ మత్స్య గ్రంథం బ్రహ్మోత్సవాలకు భక్తులు హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరుతున్నారు.

# జమ్మికుంట పట్టణంలోని లోటస్పాండ్ స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద నిలువు దోపిడి

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఫిబ్రవరి 7**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో ప్రైవేటు విద్యా సంస్థలు విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద అధిక పీసులు వసూలు చేస్తున్నారని విద్యార్థి యొక్క తల్లిదండ్రులు కంప్లైంట్ మెరకి విద్యార్థి సంఘాలు స్కూల్ యొక్క యజమాన్యాన్ని అడగగా వారితో దురుసుగా ప్రవర్తించడంతోపాటు ఇష్టానుసారంగా మాట్లాడుతూ విద్యార్థి సంఘాలపై కేసు పెట్టానని పోలీసులతో విద్యార్థి సంఘాలను బెదిరిస్తూ రాజకీయ వ్యవస్థను స్కూల్ పై తీసుకొచ్చి స్కూల్ యొక్క వ్యవస్థా బ్రస్ట్ పట్టిస్తున్నారని విద్యార్థి సంఘాల పోరాటం విద్యార్థుల యొక్క తల్లిదండ్రుల కష్టార్జితం దోపిడీ చేస్తున్నారని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి విద్యార్థి సంఘాలు లోటస్పాండ్ స్కూల్ ముందు నిరసనకు దిగి ఆందోళన చేపట్టారు లోటస్పాండ్ స్కూల్లో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి వద్ద స్కూల్ యొక్క ఫీజు హాస్టల్







యొక్క ఫీజుకి 35 వేలకి మాట్లాడుకోగా విద్యార్థి యొక్క తల్లిదండ్రుల వద్ద 46 వేల రూపాయలు వసూలు చేయడం పట్ల నిరసిస్తూ ధర్నా చేపట్టారు దీనిపై లోటస్పాండ్ ఒక యజమాన్యంకి పోలీసులకు 100 డయల్ చేయగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విద్యార్థి సంఘాలని అదుపులోకి తీసుకున్నారు తదనానంతరం యాజమాన్యాన్ని పోలీస్ స్టేషన్కు పిలిపించగా యజమాన్యం విద్యార్థి సంఘాలకు క్షమాపణ కోరారు విద్యార్థి సంఘాలు మాట్లాడుతూ ఇలా అధిక ఫీజులు వసూలు చేస్తే ఊరుకునేది లేదని మళ్లీ పోరాటాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు ఏదైతే విద్యార్థి తల్లిదండ్రుల వద్ద అధిక ఫీజు తీసుకున్నారు 10000 రూపాయలు విద్యార్థి యొక్క తండ్రికి అప్పజెప్పడం జరిగింది విద్యార్థి సంఘాల పోరాటం విద్యార్థుల తల్లిదండ్రులకు దక్కుతుందని విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు

# గ్రామపంచాయతీ ల ఆధ్వర్యంలో టీబీ ముక్త్ కార్యక్రమం

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఫిబ్రవరి 7**

భారత ప్రభుత్వం చేపట్టిన టీబి ముక్త్ అభియాన్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని టీబి ముక్త్ గ్రామపంచా యతీ కార్యక్రమంలో భాగంగా నేడు ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో జమ్మికుంట మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శిలకు టీబి ఫ్రీ గ్రామపంచాయతీ కాన్సెప్ట్ పైన ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇంచార్జీ ఎంపీడీఓ బి వెంకటేశ్వర్లు హాజరు అయ్యారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జీ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అందరూ ఈ క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని జమ్మికుంట



మండలం లోని అన్ని గ్రామాలను టీబి ఫ్రీ గ్రామాలుగా మార్చడానికి అందరి సహాయ సహకారాలు ఎంతైనా అవసరం ఉందని చెప్పారు ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్టు ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లాను టీబి రహిత జిల్లాగా చేయడానికి జిల్లా క్షయ నివారణ విభాగం మరియు జనరల్ హెల్త్ స్టాప్ తో కలిసి కొత్త కేసులను గుర్తించేందుకు ఉన్న కేసులను సక్రమంగా మందులు వాడి ట్రీట్మెంట్ సక్సెస్ రేట్ పెంచేందుకు పి ఆర్ ఐ ఇన్స్టిట్యూషన్స్ తో కలిసి గ్రామాలలో టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది.ఇదే విధంగా ప్రతి మండలంలో పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేసి వారి ద్వారా టీబి ఫ్రీ పంచాయతీలుగా చేయడానికి కృషి చేస్తామని ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్టు ప్రతినిధి ప్రభాకర్ తెలియజేశారుఈ కార్యక్రమంలో సురేందర్ ట్రైనింగ్ మేనేజర్ , మోహన్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్, దేవేందర్ రెడ్డి , ఎస్ టి ఎస్.కిరణ్ ఎస్ టి ఎల్ ఎస్ , కమ్యూనిటీ కో ఆర్డినేటర్ తిరుపతి పాల్గొన్నారు.

# బాబు అపరేషనుకు 15వేల ఆర్థిక సాయం అందజేత

**- మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్**
**- ప్రాణంతో పోరాడుతున్న చిన్నారి బాబుకు మన వంతు సహకారం అందిద్దాం**

**కరపత్రం ప్రతినిధి వేములవాడ ఫిబ్రవరి 7**

వేములవాడ పట్టణం, అంబేద్కర్ నగర్ కు చెందిన ఆరెల్లి విజయ్ కుమారుడు ఊపిరితిత్తు లలో రక్తస్రావంతో బాధ పడుతుండగా సిరిసిల్ల కరీంనగర్ హాస్పిటల్స్ చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో హైదరాబాద్ అంకుర హాస్పిటలుకు తీసుకుని వెళ్లినట్లు అక్కడ ఐసియూలో చికిత్స జరుగుతున్నట్లు అబ్బాయి తండ్రి విజయ్ తెలియ జేస్తూ చిన్నారి పాపకు ఆపరేషనుకు మీవంతు సహాయ సహకారాలు అందించండి అని మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులను కోరడంతో ట్రస్టు మరియు ఇతర సోషల్ మీడియా గ్రూపులో పోస్ట్ చేయడం జరిగింది. దాతలు




మానవతా దృక్పథంతో స్పందించి 14319/- రూపాయలు ఆర్థిక సాయం అందించ డంతో ట్రస్ట్ ద్వారా మరి కొంతకలిపి చిన్నారిబాబు ఆపరేషనుకు 15వేల రూపాయాల చెక్కు ఆర్థిక సాయంగా భాదితుని కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగిందని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేష్, వొద్యాల వేణు, పొలాస రాజేందర్, తోట రాజు, నంది సాయికుమార్, నాగుల నాగరాజు, చింతల లక్ష్మణ్ మరియూ బాధితుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.